# పాడుబుద్ధి

—బులుసు-జి-ప్రకాష్.




శంకర పద్మ గర్భ ముర
శాసములన్, భువనేశులన్ విరా
తంక ధృతిన్ మృగాక్షులకు
దాసుల జేసిన మేటికిన్ కురం
గాంక వసంత మిత్రునకు
అంజలి చేసెద, వాగతీత వి
శృంక చరిత్ర చిత్రునకు
షడ్గుణ హారికి శంబరారికిన్!

భర్తృహరి శృంగార శతకంలో మొదటి పద్యమిది.

“శంకరుడు తన అర్ధ దేహంలోను, బ్రహ్మ తన వాలుక మీదను, విష్ణువు తన వక్షః స్థలం మీదను తమ తమ భార్యలను ధరించారు. మరో పెళ్లాన్ని శివుడు తన నెత్తి నెక్కించుకున్నాడు! మహారాజులనేకులు లేడికళ్ల లేడీలకు దాసులయిపోయి ఘోర యుద్ధాలనే జరుపుకున్నారు. వీటన్నిటికీ కారణం యెవరు? చంద్రునికీ వసంతునికీ, మిత్రుడైన ఆ మన్మథుడు! అతనికి చేతులెత్తి నమస్కారం చేస్తాను!” అన్నాడు భర్తృహరి 2,500 సంవత్సరాల క్రిందట! విక్రమాదిత్యునికి సవతి తమ్ముడు భర్తృహరి.

అలా పార్కులలో బీటు వేసి వేసి, నీలవేణిని అర్ధాంగిగా చేసుకున్నాడు విభీషణరావు. కొత్త పెళ్లి జంటకు ఆషాఢమాసం ఒక శాపం! ఆ శాపం నుండి విభీషణరావుకీ విమోచనం కలగలేదు.

“ఏవండోయ్ శ్రీవారూ! జాగ్రత్త! వంటింట్లో రాళ్లేరిన బియ్యం ఉన్నాయ్! పోపుల డబ్బాలో ఆవాలు జీలకర్ర మెంతులు అన్నీ వున్నాయి. జాగ్రత్తగా వంట చేసుకోండి. రాత్రివేళ గాస్ సిలండర్ కున్న రెగ్యులేటర్ నాబ్ మూయ్యడం మరచిపోకండి!” అంటూ ఎన్నో జాగ్రత్తలు చెప్పి బయలుదేరింది నీలవేణి.

“వెళుతున్నావా? అయ్యో వెళుతున్నావా? పయనమయే ప్రియతమా నను మరచిపోకుమా!” అని చిన్న కూనిరాగం తీశాడు విభీషణరావు.

“ఛఁ పాడుబుద్ధి!” అంది నీలవేణి.

“నిన్ను విడిచిపెట్టి ఉండలేనని పాడితే, పాడు బుద్ధంటావేంటి డాళింగ్!”

“అది కాదండీ! మీరు పాటపాడు బుద్ధండీ పాడు బుద్ధంటేను ...” సమర్థించుకుంది నీలవేణి.


“అమ్మ గడుసుపిల్లా!” అని బిగియార కౌగలించుకున్నాడు విభీషణరావు.

నీలవేణి ఆటోలో వెళిపోతూ టాటా చెప్పేసింది.

నీలవేణి బయలుదేరిందో లేదో హోరున వర్షం – ఓ గంట సేపు ఎడతెరిపి లేకుండా కురిసింది!

వాన వెలిసింది.

వాతావరణం ఎంతో ఆహ్లాదంగా వుంది. ఆహా! మంచి సమయానికి నీలవేణి వెళిపోయిందే వుట్టింటికి? దిక్కుమాలిన మన్మథుడొకడు తిన్నగా ఉంటాడా? వాడిగా వున్న రాముని బాణం గుండెలోకి దూసుకుపోయి నేలకూలేడు వాలి! ఎటువంటి వాడీ లేకుండా మెత్తటి, మృదులమైన, సున్నితమైన వూల బాణంతో యువత గుండెల్లోకి దూసుకుపోయి, రెచ్చగొట్టి, కైపెక్కించేసి, మత్తెక్కించేసి, పిచ్చెక్కించేసి ఎన్ని బాధలు పెట్టేస్తున్నాడు మన్మథుడు!



అరేబియా ఎడారిలో – వారి ఇతి హాసాల ప్రకారం "ఫీనిక్స్" అనే పక్షి వుండేదని, అది ప్రతి 500 సంవత్సరాలకు తనకు తానుగా మంటల్లో కాలి బూడిదైపోయి, అదే బూడిద లోంచి కొత్త యౌవనాన్ని పుంజుకుని ఆవిర్భవిస్తుందట!

మన్మథుణ్ణి శివుడు తన త్రేతాగ్ని నేత్రంతో కాల్చేసి బూడిద చేసేసినా, ఫీనిక్స్ పక్షిలాగ అనతి కాలంలోనే మళ్లీ మళ్లీ ఆవిర్భవించేసి మనల్ని కాల్చుకు తింటున్నాడు!

ఇంతలో డుర్రుమని చప్పడు చేస్తూ, పాయ్ పాయ్ అని హారను కొడుతూ ఇంటిముందు ఆటో ఆగింది. ఎవరు చెప్మా అని మేడ మీంచి కిందకు చూశాడు విభీషణరావు. పంజాబీ డ్రస్సు వేసుకుని, వానలో తడిసి, ఒక ముగ్ధ మనోహరి – ఒక నవోఢ – ఆటో దిగింది. ఇంకెవరు? నీలవేణి!

"ఇదేమిటి చెప్మా? గంట కిందటే బయలుదేరి నీలవేణి అపుడే వెనక్కొచ్చేసిందేమిటి? వెళ్లినప్పుడు చీరతో వెళ్లింది. ఇప్పుడు పంజాబీ డ్రస్సుతో వచ్చిందేమిటి? సరే యెవరైతేనేమిటి – ఇలాంటి ఆహ్లాదకర వాతావరణంలో నీలవేణి రావడమే మంచిది. లేకపోతే నా యౌవనం అంతా అడవికాచిన వెన్నెల అయేదే కదా?" అనుకున్నాడు విభీషణరావు.

"ఇదేమిటి నీలవేణి డియర్! గంట కిందటే వెళ్లి అపుడే వచ్చేసేవేమిటి? ట్రెయినేమైనా రద్దయిందా? లేక ఇన్‌డెఫినెట్ లేటా?" అడిగాడు విభీషణరావు.

"అదేమిటి బావగారూ! నన్ను నీలవేణీ అంటున్నారేమిటి? నేను అలివేణిని, నీలవేణి కవల సిస్టర్ని" అందామె.

విభీషణరావు ఖంగుతిన్నాడు! ఔను కదూ! నీలవేణీ అలివేణీ కవల సిస్టర్లు! ఆ విషయం తను మరచేపోయాడు. బుర్ర గోక్కుంటూ – "అయితే అలివేణీ! నువ్వెందుకు వచ్చినట్టు? ఏమిటి కథ?" అడిగాడు కుతూహలం చంపుకోలేక.

"ఈ వూళ్లో ఇంగ్లీష్ లెక్చరర్ల సెమినార్ వుంది. ఆ సెమినార్‌కని వచ్చాను. ఇంతకీ అక్క ఏదీ?" అడిగింది అలివేణి.

"తెల్లవారితే ఆషాఢమాసం కదా! మీ అక్క మీ యింటికే బయలుదేరింది. ఆమే అలా వెళ్లింది. నువ్వు ఇలా వచ్చావు" అన్నాడు.

"ఏవమ్మా అలివేణీ బావున్నావా?" అని పలకరించింది విభీషణరావు తల్లి మంచినీళ్లందిస్తూ.

"బావున్నానత్తయ్యా! మీరు బావున్నారా?"

"ఆ బావున్నానమ్మా! తడిబట్టల్తో ఉన్నావ్. బట్టలు మార్చుకో అమ్మా!"

అలివేణి పక్క గదిలోకి వెళ్లి తడిబట్టలు విడిచేసి . పొడి బట్టలు కట్టుకుంది. పొడి తువాలుతో జడను పిండుకుని, ముడివేసుకుని, జడకు తువాలు చుట్టుకుంది.

రాత్రి భోజనాలయాక విభీషణరావు తన గదిలోనూ, అలివేణి తన పక్క గదిలోనూ పడుకున్నారు.

అర్ధరాత్రయినా విభీషణరావుకి నిద్ర పట్టలేదు. మన్మథుడు తన మనస్సుని మథించేస్తున్నాడు!

అలివేణి గాఢ నిద్రలో వుంది. నైట్ లేంపు మిణుకుమిణుకు మంటూ మిణుగురు పురుగులా కాంతులిస్తూంది. తెరపక్క నుంచి విభీషణరావు బితుకుబితుకుమంటూ అలివేణి గదిలోకి ప్రవేశించాడు. అలివేణి పైట పక్కకు జారిపోయింది. ఆ దృశ్యాన్ని చూసేసరికి విభీషణరావు పిచ్చెక్కిపోయాడు! ఆమె వక్షం మీద చెయ్యి వేస్తే? కొంపతీసి దొంగ దొంగ అని అరిస్తే? ఇరుగు పొరుగువాళ్లు లేచి ఒళ్లు హూనం చేసేస్తారు! వాళ్లమ్మ లేచి నాలుగు చీవాట్లు పెడుతుంది. అంతా రసాభాస అవుతుంది. తన దుర్బుద్ధికి, నీలవేణి విడి ఆకులపై సంతకాలు పెట్టడానిక్కూడా వెనుకాడదు. అమ్మ బాబోయ్! గుండె దడదడలాడింది. ఒకవేళ అలివేణి అరిచిందే అనుకుందాం. ఆ అవమానం ఆమెకు మాత్రం కాదా? ఆమె సంగతి అందరికీ తెలిస్తే మునుముందు ఆమెను ఎవరు పెళ్ళాడుతాడు?

ఏమైతే అయిందని ధైర్యంగా ఆమె పక్కని పడుకున్నాడు. కొంచెం ఆమె వక్షం మీదికి చేతులు పోనిచ్చాడు. ఆమెకు తెలివి రాలేదు. జాకెట్టు గుండీలు విప్పాడు. అలివేణికి తెలివి వచ్చినా కిక్కురుమనకుండా ఊరుకుంది. ఆమె ప్రతిస్పందనకి పొంగిపోయాడు విభీషణరావు. ఆమె గట్టిగా విభీషణరావుని గుండెల మీదకు లాక్కుంది.

అంతా అయిపోయాక "ఛీ పాడు బుద్ధి!" అంది అలివేణి.

"అంతా అయిపోయాక ఇదేం పాడు బుద్ధి అలివేణీ! మీ అక్కలేని లోటు తీర్చావు! ఏ మొగుడూ లేకపోతే అక్క మొగుడే గతి అనే సామెత నిజం చేశావు. మెనీ మెనీ థాంక్స్!" అని ముద్దుల్లో ముంచెత్తాడు అలివేణిని .

"ఛీ పాడు బుద్ధి! మీ పాడు బుద్ధిని తెల్సుకుందామని ఇలా నాటకం ఆడాను. నిజంగా మా చెల్లి అలివేణే అయితే ఆమెను చెడదీసే ప్రయత్నం చేసే వారన్నమాట! నాకే ఆషాఢ మాసమూ లేదు. వేనెక్కడే వుంటాను!" అంది నీలవేణి.

విభీషణరావు బుర్ర గిర్రున తిరిగింది!

తలుపు పక్కనించి విభీషణరావు తల్లి చూసి ముసిముసి నవ్వులు నవ్వుకుంది.